క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



నాగిరెడ్డిపేట: ఎండ తీవ్రత దృష్ట్యా ఎప్పటికప్పుడు నర్సరీలోని మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని బంజరతండా నర్సరీని శనివారం ఆయన పరిశీలించి పంచాయతీ కార్యదర్శి మమతకు పలు సూచనలు చేశారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



దోమకొండ: భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ శనివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, దోమకొండ, బీబీపేట ఎంపీపీలు కానుగంటి శారద, బాలమణి తదితరులు ఉన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కామారెడ్డి రూరల్: కల్తీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని వ్యవసాయశాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ అధికారులు షాపు నిర్వాహకులను హెచ్చరించారు. పట్టణంలోని పలు దుకాణాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్ తదితర వాటిని పరిశీలించారు. తనిఖీల్లో ఎల్లారెడ్డి ఏడీఏ రత్న, ఏవోలు అనిల్ కుమార్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

బాన్సువాడ : కార్మిక శాఖ ఆధ్వర్యంలో స్టోన్ క్రషర్స్‌లో పని చేస్తున్న పలువురు కార్మికులకు శనివారం సీఎస్‌సీ హెల్త్‌కేర్ సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రమను నమ్ముకుని జీవిస్తున్న కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. కార్మికులకు 50 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు వెల్లడించారు.

వంద పడకల ఆస్పత్రికి నేడు మంత్రి శంకుస్థాపన



ఎల్లారెడ్డి: పట్టణంలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

త్వరలో గొర్రెల పంపిణీ

మద్నూర్: మండలంలో రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం సమాయత్తం అవుతుందని పశువైద్యాధికారి బండివార్ విజయ్ వెల్లడించారు. స్థానిక రైతు వేదికలో శనివారం రెండో విడత గొర్రెల పంపిణీ, వాటి పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి త్వరలో గొర్రెలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ గంగాధర్, సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విఠల్, బీఆర్‌ఎస్ ప్రచార కార్యదర్శి కుషాల్ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామ నల్లపోచమ్మ ఆలయానికి బీజేపీ కామారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి చేసిన ఆర్థిక సహాయంతో స్లాబ్ పనులు శనివారం పూర్తి చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, నాయకులు శ్రీధర్ రెడ్డి, గొల్కొండ నర్సింహారెడ్డి వెల్లడించారు.

కాచాపూర్‌ను వల్లకాడు కానివ్వం

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల వల్ల ఊరు వల్లకాడు కాకుండా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాచాపూర్ వీడీసీ చైర్మన్ మైపాల్ అన్నారు. శనివారం గ్రామంలో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నిరసన దీక్షలు శనివారం నాటికి 33 రోజుకు చేరుకున్నాయి.

ఏళ్ల కల.. నెరవేరనుంది

- లింగంపల్లికలాన్‌లో వంతెన కోసం రూ.50.90 లక్షలు మంజూరు
- నిర్మాణానికి నేడు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన
- గతంలో కాలువ దాటుతూ ప్రమాదవశాత్తు మునిగి పలువురి మృతి



వంతెనను నిర్మించనున్న ప్రాంతం



ప్రమాదకరంగా పోచారం కాలువను దాటుతున్న గ్రామస్తులు (ఫైల్)

నాగిరెడ్డిపేట: పోచారం కాలువపై వంతెన నిర్మాణం కోసం ఎట్టకేలకు కదలిక వచ్చింది. వంతెన లేకపోవడం వల్ల కాలువ దాటుతూ మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన పలువురు నీటిలో మునిగి గతంలో పలువురు మృత్యువాత పడ్డారు. వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న లింగంపల్లికలాన్ గ్రామస్తుల కల నెరవేరనుంది. పోచారం ప్రధాన కాలువపై వంతెన లేకపోవడం వల్ల ఆ గ్రామస్తులు తప్పనిసరైన పరిస్థితుల్లో కాలువను దాటాల్సిన పరిస్థితి. పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులను పలుమార్లు వేడుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చొరవ తీసుకొని పోచారం కాలువపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.50.90 లక్షలు మంజూరు చేయించారు. వంతెన నిర్మాణ పనులకు ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు లింగవంపల్లికలాన్ గ్రామం వద్దనున్న శంకుస్థాపన చేయనున్నారు. వంతెన నిర్మాణంతో ఆ గ్రామస్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. గ్రామ శివారులోని మంజీర నది పూర్తిస్థాయిలో నిండిన సమయంలో పొలం పనులకు స్థానికులు, పశువులు, మేకలు, గొర్రెలను మేత కోసం తప్పని పరిస్థితుల్లో పోచారం కాలువలోని నీళ్లలో నడుచుకుంటూ ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సిన పరిస్థితి. ఆదేవిధంగా పెళ్లిళ్ళ సమయంలో అవసరమైన పందిరి కట్టెల కోసం కాలువను దాటి వెళతారు. కాలువ దాటే సమయంలో 20 ఏళ్లల్లో పది మంది వరకు మృత్యువాత పడ్డారు. ఏడాదిలోగా వంతెన పనులను పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెల్లడించారు.

ఎంతో ఉపయోగం



వంతెన నిర్మాణం పూర్తయితే ఎంతో ఉపయోగం. గతంలో కాలువ దాటుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఎంతో మంది మృత్యువాత పడ్డారు.

– నాయికోటి సాయిలు, లింగంపల్లికలాన్ గ్రామం

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కృతజ్ఞతలు. వంతెన కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు కల త్వరలో నెరవేరనుంది. కాలువ అవతల వైపు పొలాలున్న రైతులకు ఎంతో ఉపశమనం.

– శెట్టిగారి పోచయ్య, లింగంపల్లికలాన్ గ్రామం

కొత్త పంచాయతీలతో చేరువైన పాలన



సీతారాంపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ: తండాలు, అనుబంధ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు పాలన చేరువైందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని సీతారంపల్లిలో రూ.22 లక్షలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనం, రూ.4 లక్షలతో చేపట్టనున్న కుర్మ సంఘం భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ జాలిగాం నాంపల్లి, దోమకొండ, బీబీపేట వైస్ ఎంపీపీలు బాపురెడ్డి, రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూధన్‌రావ్, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ..

దోమకొండ సబ్‌స్టేషన్‌ను గంప గోవర్ధన్ అకస్మికంగా తనిఖీ చేసి విద్యుత్ సరఫరా గురించి ట్రాన్స్‌కో ఏడీ కిరణ్ చైతన్యను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో ఏడీని ఆదేశించారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొననున్న మంత్రి



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

లింగంపేట: మండల కేంద్రమైన లింగంపేటలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనంలో వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్న సభా వేదికను పరిశీలించారు. లింగంపేటలో మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. శెట్పల్లి చౌరస్తా వద్ద వెయ్యి బైకుల ర్యాలీతో మంత్రికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట నాయకులు దివిటి రమేశ్, ముదాం సాయిలు, శ్రీకాంత్, పోకల సాయిరాం, నహీం తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

నాగిరెడ్డిపేట: ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శి మమతకు ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని చీనూర్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు తగిన వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్యకు సూచించారు. అనంతరం బంజరతండాలో రహదారి పక్కన అవెన్యూ ప్లాంటేషన్ వద్ద పిచ్చి మొక్కల తొలగింపు పనులను పరిశీలించారు.

రమాబాయి అంబేడ్కర్‌కు నివాళి



బాన్సువాడలో రమాబాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బాన్సువాడ : రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం బాన్సువాడలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ అధ్యక్షుడు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ రమాబాయి తన త్యాగాల పునాదులపై బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను ఒక మేను పర్వతంగా నిలబెట్టిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, రాములు, గంగాధర్, బాలకృష్ణ, సాయిలు, సంతోష్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకే బస్తీ దవాఖానాలు



రామారెడ్డిలో బస్తీ దవాఖానా ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సంజీవ్

రామారెడ్డి: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని సర్పంచ్ సంజీవ్ అన్నారు. రామారెడ్డిలో బస్తీ దవాఖానా భవన నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ చేవారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దవాఖానాలో డాక్టర్, స్టాఫ్‌నర్స్, నర్స్ అందుబాటులో ఉండి రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ సోమవారం నుంచి వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ పశుపతి, రాజేందర్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ : పట్టణంలోని ఎల్లయ్య చెరువు కట్టపై కొనసాగుతున్న సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ పనులను వేగవంతం చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ. 1.66 కోట్లతో ఎల్లయ్య చెరువు కట్టపై కొనసాగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం దగ్గరపడుతున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రధాన రహదారి నుంచి సింధు విద్యాలయం వరకు రూ.26 లక్షలతో బీటీ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్పీకర్ వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జీలుగ విత్తనాలకు డిమాండ్



పుల్కల్‌లో విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ



రామారెడ్డిలో జీలుగ విత్తనాల కోసం క్యూ లైన్‌లో చెప్పులు పెట్టి వేచి చూస్తున్న రైతులు

రామారెడ్డి: జీలుగ విత్తనాల కోసం శనివారం ఉదయం నుంచి క్యూ లైన్‌లో చెప్పులు పెట్టి రైతులు బారులు తీరారు. రామారెడ్డిలో సింగల్ విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి, ఎంపీపీ దశరథ్‌రెడ్డి జీలుగు, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. 30 కిలోల జీలుగ విత్తనాల బ్యాగు రూ 842.70, జనుము రూ.1,224.80 సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఏవో హరీష్, సర్పంచ్ సంజీవ్, సొసైటీ వైస్ చైర్మన్ పశుపతి, డైరెక్టర్ లక్ష్మా గౌడ్, రైతు బంధు మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా డైరెక్టర్ కసర్ల రాజేందర్, సీఈవో భైరయ్య పాల్గొన్నారు.

బిచ్కుంద: మండలంలోని పుల్కల్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్మన్ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ రాజు పటేల్, ఏవో పోచయ్య రైతులకు జీలుగా, జనుము విత్తనాలు పంపిణీ చేశారు. ఆ విత్తనాలను సాగు చేస్తే భూమిలో సారవంతం పెరుగుతుందన్నారు.

రాజంపేట: మండలంలోని ఆర్గొండ సొసైటీ పరిధిలో జీలుగ విత్తనాలను సొసైటీ చైర్మన్ కందిశివ రాములు రైతులకు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షుడు నిమ్మల సుధాకర్ రెడ్డి, డైరక్టర్లు బుట్టరాజు, తోట మధుకర్, సీఈఓ సాయిలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పిట్లం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ సూచించారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని బ్రహ్మణపల్లి గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ఓంకార్, కాశగౌడ్ తదితరలు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తాం



మద్నూర్: రైతులకు సోమవారం నుంచి సోయాబీన్ కేడీఎస్ 726 సర్టిఫైడ్ కల్గిన నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామని మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ చాట్లావార్ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక ఎంఎఫ్‌పీసీ కార్యాలయంలో శనివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 కిలోల విత్తనాల బ్యాగుకు రూ.2,200 చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు చందర్, రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా నియామకం



లింగంపేట: మండల బీఆర్ఎస్ యువజన సంఘం ఉపాధ్యక్షుడుగా ఎక్కపల్లి గ్రామానికి చెందిన ఎరుకల నవీన్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ తెలిపారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. నాయకులు ముదాం సాయిలు, సిద్దారెడ్డి, నరహరి, నరేశ్, శ్రీకాంత్, నహీం, సంగయ్య, ఫతియొద్దీన్, బాల్‌రాజు, సందీప్, పరుశురాం పాల్గొన్నారు.

క్రీడా సమాచారం

● క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులతో క్లబ్ సభ్యులు

రామారెడ్డి: సీఎం కప్ కోసం నిర్వహించిన క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శనివారం 5:30 క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయం అని గురుకుంట స్వామి పేర్కొన్నారు.

● స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ



ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పోలీస్ జట్టు

సదాశివనగర్: జిల్లా స్థాయిలో నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా ఎల్లారెడ్డి సబ్ డివిజన్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రామన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● 29న రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

కామారెడ్డి అర్బన్: జూనియర్ రగ్బీ బాల బాలికల జట్ల ఎంపిక స్థానిక డెయిరీ టెక్నాలజీ కళాశాలలో సోమవారం నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నీలం రవి తెలిపారు. ఆసక్తి ఉండి 2005 నుంచి 2007 మధ్య జన్మించిన వారు ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

ఆధ్యాత్మికం

■ నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన



నిజాంసాగర్: బ్రహ్మణపల్లి అంజనాద్రి ఆలయ క్షేత్రంలో శనివారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కలశాలు, బోనాలు, నవగ్రహ విగ్రహాలతో ఊరేగించారు. మూడు రోజల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త పట్లోళ్ల కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నవగ్రహ విగ్రహాలదాత ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులు, సర్పంచ్ బాలయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

■ ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

బీబీపేట: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున స్వామి, ముత్యాలమ్మ, పోచమ్మ, నాయకమ్మ దేవి ఆలయాల స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలకు ఆలయాలు ముస్తాబు చేశారు. మున్నూరు కాపు సదరు సంఘం అధ్వర్యంలో ఆదివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

■ రేపటి నుంచి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

నిజాంసాగర్: మండలంలోని నర్వ గ్రామ రేణుకా ఎల్లమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు రాజేశ్వర్‌గౌడ్, బాస్కర్‌గౌడ్ తెలిపారు.

■ హనుమాన్ ఆలయంలో ఎంపీ పూజలు



మద్నూర్: మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ఎంపీకి తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్షిప్తం

బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం

కామారెడ్డి అర్బన్: బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆరోపించారు. లిక్కర్ స్కాంలో సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత పేరు ఉందని హంగామా చేసిన బీజేపీ నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

బీరప్ప ఆలయం వద్ద మైలపోలు మహోత్సవం

బాన్సువాడ: పట్టణంలోని బీరప్ప ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా మైలపోలు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పోచమ్మ పండగ, సోమవారం బీరప్ప కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బీరప్ప నర్సగొండ, సాయిగొండ, విఠల్‌లు తెలిపారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

బిచ్కుంద: మండలంలోని కందర్‌పల్లి రాచూర్ వెళ్లే రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి సర్పంచ్ అరుణ్ కుమార్ భూమి పూజ చేశారు. పనులకు రూ.19 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

31న రెడ్డి సంక్షేమ సంఘ భవనం పనులు ప్రారంభం

రాజంపేట: కామారెడ్డి జిల్లా టెక్రియాల్ పరిధిలో 31వ తేదీ రెడ్డి సంక్షేమ భవన నిర్మాణానికి చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జాకంటి సుధాకర్ రెడ్డి కోరారు.

హనుమాన్ ఆలయానికి విరాళం

పిట్లం: మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయ అభివృద్ధికి గుండెనెమ్లికు చెందిన సాయిరెడ్డి, అంజిరెడ్డి, రాంపూర్‌కు చెందిన సునీత బలరాంరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన మందాద్రి రెడ్డి, బాన్సువాడకు చెందిన వెంకట్‌రెడ్డి విరాళం అందజేశారు.

శ్మశానవాటిక అభివృద్ధికి..

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి గ్రామానికి చెందిన కొవ్వూరి నర్సమ్మ జ్ఞాపకార్థం కొవ్వూరి చంద్రశేఖర్ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రూ.31 వేలు విరాళం ఇచ్చారు.

ఆస్పత్రిలో వసతులు ఏవీ?

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు దేవేందర్, విద్యాసాగర్, ప్రశాంత్‌గౌడ్, సతీష్, రాజేష్ ఆరోపించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి

కామారెడ్డి రూరల్: పారిశుధ్య పనుల్లో భాగంగా వీధులన్నీ శుభ్రం చేసినట్లు మండలంలోని తిమ్మక్‌పల్లి(కె) గ్రామ సర్పంచ్ జ్ఞానేశ్వర్ తెలిపారు.

సంఘాలను బలోపేతం చేయాలి

సదాశివనగర్: గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి పేర్కొన్నారు. సంఘాల నుంచి డబ్బులను త్వరితగతిన వసూలు చేసి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కుంట రజిత, సీసీలు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్: పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 18 మంది లబ్ధిదారులకు తహసీల్దార్ దశరథ్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.